క్లుప్తంగా

బోరుమోటారు మరమ్మతుకు వినతి

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మన్సూర్‌పూర్‌లో గత కొద్దిరోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. ప్రత్యామ్నాయంగా ఉన్న బోరు మోటారు కూడా చెడిపోయింది. దీంతో తాగునీటి కోసం తీవ్రఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. బోరు మోటారుకు మరమ్మతులు చేయించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు.

ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు

ఆలయ ఈఓ లావణ్య



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈఓ లావణ్య

పటాన్‌చెరు: నూతన సంవత్సరం సందర్భంగా గణేష్ గడ్డ దేవస్థానానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ లావణ్య తెలిపారు. సోమవారం ఆలయ ఆవరణలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆలయానికి వచ్చే భక్తులు కేటాయించిన పార్కింగ్ స్థలంలోనే వాహనాలు ఆపాలన్నారు. ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమం కొనసాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్, అర్చకులు సంతోష్ జోషి, జగదీశ్వర్ స్వామి, చంద్రశేఖర్, అయ్యప్ప, సతీష్ పాల్గొన్నారు.

మహాపడిపూజకు ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గోపాల్

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్ షష్టిపూర్తి తులాభారం, 29వ ఇరుముడి సందర్భంగా జనవరి 1న ఉ.11 గంటలకు అయ్యప్ప మందిరంలో మహా పడిపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని మాజీ మంత్రి హరీశ్‌రావు నివాసంలో ఆయనను సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో కలసి చింతాగోపాల్ ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు శివరాజ్‌పాటిల్, కౌన్సిలర్లు చౌదరి ప్రకాష్, సత్యంగౌడ్, గురుస్వాములు, కృష్ణమనాయుడు, సోమశేఖర్, సున్నం రాము, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

హోరాహోరీగా కుస్తీ పోటీలు



వెండికడియం అందజేస్తున్న అంజయ్య, తదితరులు

రాయికోడ్(అందోల్): మండలంలోని హస్నాబాద్ గ్రామంలో ఉర్సు జాతర వేడుకల్లో భాగంగా సోమవారం నిర్వహించిన కుస్తీపోటీలు హోరాహోరీగా సాగాయి. వివిధ ప్రాంతాలకు చెందిన మల్లయోధులు పోటీల్లో తమ ప్రతిభ చాటారు. పోటీల్లో గెలుపొందిన మల్లయోధులకు జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ అంజయ్య , నాయకులు, అధికారులతో కలిసి వెండి కడియాలు బహూకరించారు. కార్యక్రమంలో జహీరాబాద్ రూరల్ సీఐ హన్మంతు, ఎస్ఐ నారాయణ, ఎఎంసీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సిద్దప్ప పాటిల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలు, నాయకులు బసవరాజ్ పాటిల్, కేధారినాథ్ పాటిల్, ఎండీ సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు

జిన్నారం (పటాన్‌చెరు): క్షయ వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా గుమ్మడిదల మండలం అన్నారం గ్రామం పంచాయతీలో ఉచిత క్షయ వ్యాధి శిబిరాన్ని మాజీ సర్పంచ్ మురళి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మధుకర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది 115 మందికి పరీక్షలు నిర్వహించగా.. 12 మందికి క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. వీరికి తేమడ పరీక్షలు చేసి చికిత్స ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ప్రతాప్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంగీత, ఎంపీహెచ్ఓ దేవేందర్, టీబీ జిల్లా కోఆర్డినేటర్ కృష్ణ, టీబీ ఫీల్డ్ ఆఫీసర్ చందు, సిబ్బంది శోభా వసంత, నస్రీన్ ఇర్ఫానా, సరిత ఆశావర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎనిమిదేళ్లుగా ఎదురుచూపులు

ఇన్సెంటివ్ డబ్బుల కోసం ప్రదక్షిణలు



పుల్‌కల్‌లో మూతపడ్డ విజయ డెయిరీ

- అధికారుల చేతివాటంతో నష్టం
- మూతపడ్డ పాల కేంద్రాలు
- లబోదిబోమంటున్న పాడి రైతులు

సంగారెడ్డి: ఎనిమిదేళ్లుగా తమకు రావాల్సిన సొమ్మును ఇవ్వకపోగా ప్రత్యక్ష దాడులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో పాడి రైతుల్లో భయాందోళన నెలకొంది. కొన్ని కేంద్రాల్లో అధికారులు చేతివాటంతో పాలకేంద్రం మూతపడింది. అయినా కిందిస్థాయి అధికారులపై చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పాడిని నమ్ముకున్న రైతులకు గిట్టుబాటు ధర దక్కాలి. ప్రజలకు స్వచ్ఛమైన పాలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం విజయడెయిరీని ఏర్పాటు చేసింది. ఈ డెయిరీని పాలు పోసే రైతులకు లీటరుకు రూ.4 చొప్పున ప్రోత్సాహకం అందిస్తున్నారు. అయినా గత మూడేళ్లుగా ప్రోత్సాహక నిధుల విడుదలలో జాప్యం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. కానీ, వాస్తవానికి కొందరి రైతులకు ఎనిమిది ఏళ్లుగా ఇన్సెంటివ్ డబ్బులు అందలేదంటే అధికారుల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

రూ.5 కోట్లకు పైగా బకాయిలు..

జిల్లాలో ప్రస్తుతం రోజుకు 14 వేల లీటర్ల పాలు సేకరిస్తున్నారు. వెన్నశాతం ఆధారంగా లీటరు పాలకు రూ.36.50 నుంచి రూ.72.27 వరకు చెల్లిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. పాడి రైతులను మోసం చేస్తున్నారనే వాదనతో విజయ డెయిరీకి పోయకుండా ప్రైవేటుగా అమ్ముకుంటున్నామని కొందరు రైతులు తెలిపారు.

నగదు బదిలీ జరగక అవస్థలు ..

జిల్లాలోని నారాయణఖేడ్, జహీరాబాద్, పుల్కల్‌లో పాలశీతలీకరణ కేంద్రాలున్నాయి. ఇందులో పుల్‌కల్ కేంద్రం అధికారులు రైతులను మోసం చేయడంతో వారు పాలుపోయకపోవడం డెయిరీ మూతపడింది. ఖాతాలు తప్పుగా ఇచ్చారని రైతులను ఇబ్బందులు పెట్టి వారి సొమ్మును కాజేస్తున్నారు. దీంతో ప్రభుత్వం నిధులు విడుదల చేసినా సకాలంలో పాల ఉత్పత్తిదారులకు అందక అక్రమాలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనిని కట్టడి చేయాలన్న ఉద్దేశంతో పాల ఉత్పత్తిదారులకు ఇచ్చే ప్రోత్సహకానికి నగదు బదిలీ విధానం అమలు కాక రూ.5 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని అధికారులే చెబుతున్నారు.

వెంటనే మంజూరు చేయాలి

పదేళ్లుగా గ్రామంలోని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో పాలు పోస్తున్నా. రోజుకు సుమారు 6 లీటర్లు విక్రయిస్తా. గతంలో 15 రోజులకో సారి బిల్లులు చెల్లించేవారు. ప్రోత్సాహక నిధులు మూడేళ్లుగా అందడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి వెంటనే మంజూరు చేయించాలి.

–ఈరన్న, టేకూర్, న్యాల్‌కల్ మండలం

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

లీటర్‌కు రూ.4 చొప్పున ఇచ్చే ప్రోత్సాహకంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాం నుంచే నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రోత్సాహక నిధుల బకాయిల విషయం ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నాం.

–గోపాల్‌సింగ్ డిప్యూటీ డైరెక్టర్(డెయిరీ)

వరి కొయ్యలను కాల్చొద్దు

మండల వ్యవసాయ అధికారి శ్రీహరి



పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వట్‌పల్లి(అందోల్): వరికోతలు కోసిన తర్వాత రైతులు కొయ్యలను తగలబెడుతున్నారు. వరి కొయ్యలను కాల్చడంతో వాయు కాలుష్యం, భూమిలోని పంటలకు మేలు చేసే రకరకాల సూక్ష్మ జీవులు చనిపోయి భూసారం తగ్గుతుందని అందోల్ మండల వ్యవసాయ అధికారి శ్రీహరి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మాసానిపల్లి, డాకూర్ ఆయా గ్రామాల్లో పంటలు పూర్తయిన భూములను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. సేంద్రియ కార్బన శాతం కూడా తగ్గిపోతుంది. కావునా, వరి కొయ్యలను నేలలో కలియదున్నటం వల్ల సేంద్రియ కార్బన శాతం, పోషకాలు సూక్ష్మజీవుల లభ్యత పెరిగి భూసారం కాపాడుకోవచ్చని తెలిపారు. ఎకరానికి 50 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 10 నుంచి 15 కిలోల యూరియా వరికొయ్యల అవశేషాలపై చల్లాలని తెలిపారు. నీటిలో బాగా కుళ్లి భూమిలో కలిసిపోతోంది. అలాగే, వరినారును చలి నుంచి కాపాడుకోవడానికి ఉదయం పెట్టిన నీటిని సాయంత్రం తీసివేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

ఆశాజనంగా శనగ పంట

మండల వ్యవసాయ అధికారిణి లావణ్య

జహీరాబాద్ టౌన్: మండలంలోని హోతి(బి) గ్రామంలో రైతులు సాగు చేసిన శనగ పంటను సోమవారం వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. జాతీయ ఆహార భద్రతా పథకం కింద రైతులకు ఎన్‌బీఈజీ–45 రకం విత్తనాలను పంపిణీ చేశారు. ఈ మేరకు మండల వ్యవసాయ అధికారిణి లావణ్య గ్రామాన్ని సందర్శించి పంటను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ విడుదల చేసిన ఎన్‌బీఈజీ–45 రకం విత్తనాలను రైతులకు ఇచ్చాం, పంట ఆశాజనకంగా ఉందన్నారు. ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందన్నారు. ఆమె వెంట వ్యవసాయ విస్తీర్ణ అధికారి వీరేందర్, రైతులు మల్లయ్య, రాంచందర్ తదితరులు ఉన్నారు.



పంటను పరిశీలిస్తున్న ఏఓ లావణ్య తదితరులు

పక్కాగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



లబ్ధిదారు ఫొటో తీస్తున్న ఎంపీడీఓ హరినందన్‌రావు

మునిపల్లి(అందోల్): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ హరినందన్ రావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం మండలంలోని పొల్కంపల్లి, మునిపల్లితో పాటు ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను ఎంపీడీఓ పరిశీలించారు. లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. సర్వే జాబితాలో పేర్లు ఉన్నవారు తప్పనిసరిగా పంచాయతీ కార్యదర్శిని కలిసి వారికి కావాల్సిన వివరాలను నమోదు చేయించాలని లబ్ధిదారులను కోరారు. యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్న లబ్ధిదారుని స్థితిగతుల ఆధారంగా ప్రభుత్వం అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. సర్వేను వేగంగా పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సర్వే పూర్తి చేయాలి

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు ప్రజలు సహకరించాలని సంగారెడ్డి ఎంపీడీఓ యాదగిరి కోరారు. సోమవారం సంగారెడ్డి మండలంలోని ఫసల్వాదితో పాటు ఆయా గ్రామాల్లో అధికారులు సర్వే నిర్వహించారు. సర్వేను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, మండల అధికారులు పాల్గొన్నారు.

షాదీఖానాను త్వరగా పూర్తి చేయండి



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): షాదీఖానా నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆదేశించారు. ఝరాసంగంలో కొనసాగుతున్న షాదీఖానా నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సీడీపీ ద్వారా రూ. 20లక్షల నిధులు మంజూరు చేశారని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశం, గ్రామ అధ్యక్షుడు ఎజాజ్‌బాబా, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిని ఓర్వలేకనే అసత్య ఆరోపణలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలో ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి సహకారంతో చేపట్టిన అభివృద్ధిని చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. సోమవారం మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్‌సేట్, కౌన్సిలర్లు రాజేష్ చౌహాన్, నర్సింహులు, పలువురు కాంగ్రెస్ నాయకులు విలేకర్లతో మాట్లాడారు. పదేళ్లు ఎమ్మెల్యేగా, నాలుగేళ్లు బీఆర్‌ఎస్ మున్సిపల్ పాలకవర్గంగా ఉన్నా మున్సిపాలిటీ అభివృద్ధిని పట్టించుకోకపోగా నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. వారి హయాంలో అత్యధిక పనులకు కాగితాలపైనే నిధులు మంజూరయ్యాయని ఎద్దేవా చేశారు. షాదీఖానాకు నిధులే మంజూరు చేయలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది, మున్సిపల్ పాలకవర్గం కాంగ్రెస్ చేతికివచ్చి 10 నెలలు మాత్రమే అయినా పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపట్టామన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న బైపాస్ రోడ్డుతో రైతులతో పాటు పలు మండలాలకు దూరభారం తగ్గుతుందన్నారు. ఎవరి హయాంలో నిధులు దుర్వినియోగమయ్యాయో బహిరంగ చర్చకు తాము సిద్ధమన్నారు. అభివృద్ధి అడ్డుకొని చరిత్రలో నిలిచిపోవద్దని, చేస్తున్న అభివృద్ధికి సహకరిస్తే ప్రజలు హర్షిస్తారని సూచించారు. ముఖ్యనాయకులు పండరిరెడ్డి, ఈశ్వరప్ప, శంకర్ ముదిరాజ్, మాణిక్యం, దిల్‌దార్‌ఖాన్, గౌస్‌చిష్తి తదితరులు పాల్గొన్నారు.

మా భూములు మాకు కావాలి..



తహసీల్దార్ ఆఫీస్ ఎదుట నిరసన చేస్తున్న రైతులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమెల తండాకు చెందిన గిరిజన రైతులు మాజీ సర్పంచ్ మహిపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో మా భూములు మాకు కావాలని సోమవారం తహసీల్దార్ ఆఫీస్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఎమ్మార్వో వచ్చి భూములకు సంబంధించిన రికార్డులను చూపించాలని కార్యాలయం ముందు బైఠాయించారు. మాజీ సర్పంచ్ మహిపాల్ గౌడ్ మాట్లాడుతూ.. వెలిమెల, కొండకల్లు గ్రామ శివారులోని సర్వే చేయని భూములను ఎన్నో ఏళ్లుగా గిరిజన రైతులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా, 1994లో హైకోర్టు రెవెన్యూ అధికారులు విచారణ చేసి రెండు ఎకరాల చొప్పున కేటాయించాలని సూచించారు. ఈ విషయమై గిరిజనులు దరఖాస్తులు చేసుకున్న అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. సర్వే చేయని భూములను రైతులకు తెలియకుండా అధికారులు కొత్త సర్వే నంబర్లు వేసి ఇతరులకు రిజిస్ట్రేషన్లు చేసినట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. అందుకు సంబంధించిన రికార్డులను తమకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ తదితరులు

జహీరాబాద్ టౌన్: పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను జహీరాబాద్ టౌన్ ఎస్ఐ కాశీనాథ్ సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. పద్మశాలిలంతా ఐక్యంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మనోహర్, కోశాధికారి గడ్డం నాందేవ్, నాయకులు నర్సింలు, విఠల్, పండరి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఈఎస్ఐ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికుల జీతాలు ఇతర సమస్యలు పరిష్కారించాలని సీఐటీయూ సీనియర్ రాష్ట్ర నాయకులు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం రామచంద్రాపురం ఈఎస్ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్. సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. ఈఎస్ఐలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రతినెల జీతం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఆస్పత్రికి నిత్యం సంగారెడ్డి జిల్లా నుంచి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు వైద్యం కోసం వస్తుంటారని తెలిపారు. వారికి మెరుగైన సేవలు అందించాలని విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సురేష్, రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

మాజీ మంత్రి ఫరీదొద్దీన్‌కు నివాళి



మాట్లాడుతున్న ఎంపీ సురేష్ షెట్కార్ తదితరులు

జహీరాబాద్ టౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా పనిచేసిన మాజీ ఎమ్మెల్యే ఫరీదొద్దీన్ మూడవ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని ఆయన నివాసంలో సోమవారం నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ. సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, చంద్రశేఖర్, రాష్ట్ర సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ తన్వీర్, ఎంజీ. రాములు, కండెం నర్సింలు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, నాయకులు మాజీ సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ. సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే మాణిక్‌రావులు మాట్లాడుతూ.. జహీరాబాద్‌కు ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండి పోతాయన్నారు. రాజకీయాల్లో ఆజాత శత్రువు అయిన ఫరిదొద్దీన్ ఎందరికో ఆదర్శమన్నారు. ఆయనతో కలిసి పనిచేయడం అదృష్టమని కొనియాడారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న రమేష్ తదితరులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన టాలెంట్ టెస్టుకు 8, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారని వెలాసిటి ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు రమేష్ తెలిపారు. సుమారు 50 మంది విద్యార్థులు టాలెంట్ టెస్టుకు హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదుతో పాటు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఎన్నో సంవత్సరాల తర్వాత కలిసిన సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పరస్పర కుటుంబ సభ్యులను పరిచయం చేసుకొని సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవయ్య జయలక్ష్మి, మనీ, బుచ్చిరెడ్డి, మోహన్ రెడ్డి, పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జీవితాలను పాడు చేసుకోవద్దు

ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ప్రియాంక



హెల్ప్‌లైన్ పోస్టర్లు ప్రదర్శిస్తున్న అధికారులు

జోగిపేట(అందోల్): తప్పుడు నిర్ణయాలతో జీవితాలను పాడు చేసుకోవద్దని జోగిపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ప్రియాంక అన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో అందోల్ కేజీబీవీ పాఠశాలలో భేటీ బచావో.. భేటీ పడావో అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ.. బాలబాలికలు ఇద్దరు సమానమని.. బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. అనుకొని సంఘటనలు ఎదురైనప్పుడు ధైర్యంగా ఎదుర్కొవాలని.. అందుకే శరీరక దారుఢ్యం ముఖ్యమన్నారు. జోగిపేట ఏఎస్ఐ అంజయ్య మాట్లాడుతూ.. చట్టాలు, శిక్షలు గురించి వివరించారు. సోషల్ మీడియా వల్ల కలిగే నష్టాలు, సైబర్ క్రైమ్ నేరాల దృష్ట్యా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో హెల్ప్ లైన్ నంబర్లను ఉపయోగించుకోవాలని సూచించారు. జిల్లా మహిళ సాధికారత కేంద్రం సమన్వయ కర్త పల్లవి మాట్లాడుతూ.. గుడ్ టచ్ బ్యాడ్ టచ్, విద్య, ఆరోగ్యం, బాల్య వివాహాలు, అక్రమ రవాణా, హెల్ప్‌లైన్ నంబర్లు వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ (షీటీం) రవిశంకర్, భరోసా సిబ్బంది, చైల్డ్‌లైన్ కౌన్సిలర్, కేజీబీవీ సిబ్బంది, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

పటాన్‌చెరు టౌన్: పేకాట స్థావరంపై పోలీసుల దాడులు నిర్వహించి, ఎనిమిది మందిపై కేసు నమోదు చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కోటేశ్వర రావు కథనం ప్రకారం.. పటాన్‌చెరు శివారు బంగారుగడ్డ సమీపంలోని ఓ శిథిలభవనంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.12,500 నగదు, తొమ్మిది ద్విచక్రవాహనాలు, మూడు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

శాంతియుతంగా వేడుకలు

నారాయణఖేడ్: నూతన సంవత్సర వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని ఖేడ్ ఎస్ఐ శ్రీశైలం పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఎవరి ఇళ్లల్లో వారు సంతోషంగా వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. డీజేలు, బాణాసంచా కాల్చడానికి అనుమతి లేదన్నారు. మద్యం సేవించి రోడ్లపైకి రావద్దని సూచించారు. మైనర్లకు వాహనాలను ఇవ్వవద్దని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మల్లికార్జునుడి సన్నిధిలో ఎమ్మెల్యే



నారాయణఖేడ్: ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, అనుపమారెడ్డి దంపతులు, బంధువులతో కలిసి సోమవారం శ్రీశైలం మల్లికార్జునస్వామి వారిని దర్శించుకున్నారు. అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఖేడ్ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని మొక్కుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

మల్లన్నకు ప్రత్యేక పూజలు

సంగారెడ్డి: చౌటకూర్ మండలం శివ్వంపేట గ్రామ గొల్ల కురుమలు నిర్వహిస్తున్న సట్టి కార్యక్రమంలో మల్లికార్జున స్వామిని మాజీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు డోలు సప్పుళ్లతో స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సదానందరెడ్డి, శ్రీశైలం,శ్రీనివాస్, గోపాల్, రవి, భాస్కర్‌రెడ్డి , అశోక్,బ్రహ్మానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో అమావాస్య వేడుకలు

సంగారెడ్డి టౌన్: సోమవతి అమావాస్య సందర్భంగా పోతిరెడ్డిపల్లిలోని శివాలయంలో సోమవారం పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మహిళలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

